సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



ఆధ్యాత్మిక ముసుగులో..

అలంపూర్‌లో ఆధ్యాత్మిక ముసుగులో కొందరు మోసాలకు పాల్పడుతున్నారు.

వివరాలు 8లో ▸



శిక్షణ పొందేదెలా?

జిల్లాలో కోచ్‌లు లేక క్రీడాకారులు మెరుగైన శిక్షణకు దూరమవుతున్నారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.2 /18.7

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళ చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెరగాలి



నవాబుపేట: పదో తరగతి విద్యార్థుల ఉతీర్ణత శాతం మెరుగ్గా ఉండాలని డీఈఓ రవీందర్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని, కొల్లూర్, పోమాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లను పరిశీలించి పదో తరగతి విద్యార్థులకు బోధించిన పాఠ్యాంశాలపై ఆరాతీశారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం వంద శాతం ఉండేలా లక్ష్యం పెట్టుకోవాలన్నారు. గతంలో చాలా తగ్గిన ఉతీర్ణత శాతం తాజా పరీక్షల్లో పెరగాలన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వీడి బాధ్యతాయుతంగా బోధన చేయాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, అల్పాహారంపై ఆరా తీశారు. కాగా కిచెన్, స్టోర్ గదులు అపరిశుభ్రంగా ఉన్నాయని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరించారు. కేజీబీవీ సిబ్బంది సమయ పాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. అనంతరం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మొక్కలు నాటారు.

నెలాఖరు నాటికి సీఎంఆర్ పూర్తి చేయాలి



మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఈ నెలాఖరు నాటికి వందశాతం కస్టమ్ మిల్లింగ్ రైస్ డెలివరీ చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు సూచించారు. కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ సమావేశ మందిరంలో పౌరసరఫరాలు, ఎఫ్‌సీఐ అధికారులు, రైస్‌మిల్లర్లతో సీఎంఆర్ డెలివరీపై సమీక్షించారు. మిల్లుల వారీగా డిసెంబర్ 31 నాటికి నిర్ణయించిన మేరకు సీఎంఆర్ చెల్లింపు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని 43 రైస్ మిల్లులు అత్యధికంగా సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే డెలివరీ పూర్తి చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ప్రతి రోజు సీఎంఆర్‌ను పర్యవేక్షించాలని సూచించారు. టార్గెట్ ప్రకారం సీఎంఆర్ డెలివరీ చేసేందుకు స్థలాన్ని వారికి అందుబాటులో ఉంచాలన్నారు. హమాలీల సంఖ్యను పెంచాలన్నారు. సివిల్ సప్లయ్ డీఎం ప్రవీణ్, డీఎస్‌ఓ శ్రీనివాస్, ఎఫ్‌సీఐ ఏజీఎం అస్లాం, తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన కేంద్రాలు	186
ధాన్యం సేకరణ లక్ష్యం	2.69 లక్షల మె.ట..
కొనుగోలు చేసింది	32,934 మె.ట..
రైస్ మిల్లులకు తరలించింది	32,590 మె.ట..
కొనుగోలు చేసిన ధాన్యం విలువ	రూ.72.55 కోట్లు
రైతుల ఖాతాల్లో జమ చేసిన నగదు	రూ.35.25 కోట్లు
ఇంకా చెల్లించాల్సింది	రూ.37.30 కోట్లు

మన వరికి.. కర్ణాటకలో గిరాకీ

- మద్దతు ధరకు మించి కొంటున్న వ్యాపారులు
- ఆర్థికంగా ప్రయోజనం పొందుతున్న అన్నదాతలు
- జిల్లాలో 30 శాతం దాటని ధాన్యం సేకరణ లక్ష్యం
- స్థానికంగా మూతపడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): వానాకాలం సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యానికి తెలంగాణ కన్నా కర్ణాటకలో భలే గిరాకీ ఉంది. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్న అధికారులు కర్ణాటక వ్యాపారుల డిమాండ్‌ను తట్టుకోలేక కనీసం 30 శాతం లక్ష్యం కూడా దాటలేకపోవడం విశేషం. జిల్లాలోని వ్యాపారుల కంటే పక్క రాష్ట్రం కర్ణాటకలోని రాయిచూర్, యాదగిరి జిల్లాలకు చెందిన వ్యాపారులు వరి ధాన్యానికి మంచి ధర ఇచ్చి మరీ కొనుగోలు చేస్తుండటంతో 90 శాతం పంట ఇప్పటికే అమ్ముడుపోయింది.

45 కేంద్రాలు మూత..

జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులు పండించిన ధాన్యం తేకపోవడంతో ఇప్పటికే 45 కేంద్రాలు మూతపడ్డాయి. జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా 32,934 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో సంబంధించిన ధాన్యం విలువ రూ.72.55 కోట్లు ఉందని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో మొట్టమొదటిసారి ఇంత పెద్దఎత్తున ధాన్యం సేకరణ కర్ణాటక వ్యాపారులు తీసుకుపోవడంతో ఇటు వ్యాపారులు.. అటు రైతులు ప్రయోజనం పొందినట్లు అయింది. దీంతో ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం నెరవేరకపోవడం గమనార్హం. పౌరసరఫరాల శాఖ అధికారులు ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో వివరాలు నమోదు చేస్తుండడంతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. పంట పెట్టుబడికి ప్రభుత్వం నుంచి సాయం ఇంకా రాకపోవడంతో ధాన్యం డబ్బులు ఉపయోగించుకోనున్నారు. పలుచోట్ల విక్రయాలు పూర్తి కావడంతో కేంద్రాలను మూసేశారు. మరికొన్ని రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

186 కొనుగోలు కేంద్రాలు..

ప్రభుత్వం రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలుకు గిట్టుబాటు ధర కల్పించింది. క్వింటాల్ గ్రేడ్–1 రకం రూ.2,203, సాధారణ రకం రూ.2,180 మద్దతు ధర ప్రకటించింది. ఇందుకు జిల్లాలో 186 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి.. 2.69 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో సంతృప్తి చెందని రైతులు అంత కన్నా ఎక్కువ ధర వస్తుందని కర్ణాటక వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్నారు. క్వింటాలు వరి ధాన్యంపై వ్యాపారులు రూ.2,700 నుంచి రూ.3,300 మధ్య చెల్లిస్తున్నారు. జిల్లాలోని మహబూబ్‌నగర్ ప్రాంత వ్యాపారులు కూడా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. దేవరకద్ర ప్రాంతానికి చెందిన వ్యాపారులు రాయిచూర్‌కు తరలిస్తున్నారు. దీంతో ఇప్పటికే 90 శాతం అమ్మకాలు జరిగినట్లు తెలుస్తుంది.



కర్ణాటకకు తరలుతున్న బియ్యం (ఫైల్)

ఎప్పటికప్పుడు నమోదు..

కేంద్రాల్లో సేకరించిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయడంతో సేకరణ త్వరితగతిన పూర్తవుతుంది. 32,934 మె.ట., ధాన్యం కొనుగోలు చేసి ఇప్పటి వరకు 32,590 మె.ట., ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించారు. రైతులకు 72 గంటల అనంతరం ఖాతాల్లో నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు రూ.32.25 కోట్లు రైతులకు చెల్లించారు.

వ్యాపారులకే అమ్ముకున్నా..



ప్రభుత్వ మద్దతు ధర కంటే ప్రైవేట్ వ్యాపారులు వచ్చి ధాన్యానికి రూ.2,700 మాత్రమే ఇస్తుండ్రు. ఈ వానాకాలంలో పదెకరాల్లో వరి సాగు చేస్తే 227 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. పంట మొత్తాన్ని ప్రభుత్వ కేంద్రాలకు తరలించకుండా వ్యాపారులకే అమ్ముకున్నా. వ్యాపారులకు అమ్మడం ద్వారా తనకు క్వింటాపై రూ.797 ఎక్కువ లాభం వచ్చింది.

– వెంకటేశ్వర్‌రెడ్డి, రైతు, మాచన్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్

జాప్యం చేయకుండా..



వానాకాలం సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలు చేయడంలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ఈసారి రవాణా సమస్య రాకుండా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు లారీలు ఎక్కడ ఉన్నాయనే వివరాలను పొందుపర్చేలా దృష్టిసారించాం. వెనువెంటనే ధాన్యం ఖాళీ చేసేలా చర్యలు తీసుకున్నాం. ట్యాబ్‌లో త్వరగా నమోదు చేస్తున్నాం.

– ప్రవీణ్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్

మిల్లులకు చేరవేత..

జిల్లాలో వానాకాలం సీజన్‌లో 1,89,901 ఎకరాల్లో వరిసాగు చేశారు. 2.60లక్షల మె.ట.,ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా జిల్లాలో పీఏసీఎస్‌లు, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మొత్తం 186 కేంద్రాలను ఏర్పాటు చేశారు. పంట చేతికి రావడంతో అధికారులు దసరా పండుగ కాగానే కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు చేరవేస్తు న్నారు. జిల్లాలో 102 రైస్‌మిల్లులు ఉన్నాయి. వాటిలో 45మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయించారు.

నేడు 'హలో ఎమ్మెల్యే'

సాక్షి ఫోన్ ఇన్



దేవరకద్ర నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తారు. ఈ మేరకు 'సాక్షి' బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు 'హలో ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఫోన్ ద్వారా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చు.

జి.మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

ఫోన్ చేయాల్సిన నంబర్లు: 98487 57419, 97017 51369

సమయం: బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు

అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలిపెట్టం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాకేంద్రంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలిపెట్టేదిలేదని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.రవినాయక్‌ను ఎమ్మెల్యే యెన్నం కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. ఫోర్జరీ సర్టిఫికెట్లతో ప్రజలను మోసం చేసి కొందరు వ్యక్తులు అక్రమాలకు పాల్పడ్డారని, 2014 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ భూముల పరిశీలించి తిరిగి తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం అక్రమాలకు పాల్పడ్డట్లు సమాచారం ఉందని, ప్రభుత్వ భూములను దోచిపెట్టే బ్యాచ్‌ను ఎట్టిపరిస్థితుల్లో వదిలేదిలేదని కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌కు పట్టిన బురదను తొలగించాల్సిన అవసరముందన్నారు. ప్రజా ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు తావులేదన్నారు. కలెక్టర్ కార్యాలయం మార్పు విషయాన్ని కూడా చర్చించినట్లు చెప్పారు. వెంకటేశ్వర కాలనీలో కబ్జాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆస్తులు సంరక్షించడమే తమ లక్ష్యమన్నారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ప్రభుత్వ ఆస్తులను కాపాడుతామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండటమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

కేఎస్పీ నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్

- కలెక్టర్‌తో చర్చించిన ఎమ్మెల్యేలు
- త్వరలో షెడ్యూల్ ఖరారు



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి

దేవరకద్ర/మహబూబ్‌నగర్ న్యూటౌన్: కోయిల్‌సాగర్ నీటిని యాసంగి పంటలకు వదిలేందుకు నిర్ణయించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ రవినాయక్‌తో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి నీటి విడుదల విషయమై చర్చించారు. ప్రాజెక్టు నీటిని తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని అధికారులు గతంలో తీసుకున్న నిర్ణయం రైతులకు నష్టం కలిగించే విధంగా ఉందని, వెంటనే యాసంగి పంటలకు నీటిని అందించాలని సూచించారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీటిమట్టం ఉన్నందున పంటలకు వదలడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, ప్రాజెక్టు నీటిని కుడి, ఎడమ కాల్వల ద్వారా విడుదల చేయడానికి కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు నిర్ణయించారు.

ఇది రైతు ప్రభుత్వం

కలెక్టర్‌తో చర్చలు పూర్తయిన తర్వాత దేవరకద్ర, నారాయణపేట ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ రైతు ప్రభుత్వమని సాగునీటిని అందించే విషయంలో ఇబ్బందులు లేకుండా చూస్తామని తెలిపారు. ప్రాజెక్టు నీటిని యాసంగి పంటలకు విడుదల చేయడానికి త్వరలో షెడ్యూల్‌ను ఖరారు చేస్తామని పేర్కొన్నారు. వారి వెంట టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఫయాజ్ ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

కోయిల్‌కొండ: ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. మంగళవారం కోయిల్‌కొండ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను, రిజిస్టర్లను, రికార్డు గదిని, ధరణి పోర్టల్, మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధరణి ఆపరేటర్‌కు పెండింగ్ దరఖాస్తులన్నీ త్వరగా పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మీ సేవా కేంద్రాన్ని నిర్వహించాలని, కేంద్రాన్ని ఎప్పుడూ మూయవద్దని నిర్వాహకులను సూచించారు. ధరణిలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కార్యాలయానికి వచ్చిన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తమ భూములు ఇతరుల పేర్లపై ఉన్నాయని వాటిని తమ పేరుపై మార్చుకునేందుకు వచ్చామని వారు కలెక్టర్‌తో తెలిపారు. తహసీల్దార్ భరత్, డీటీ మురళీ ఉన్నారు.

ప్రభుత్వ భూముల జాబితా రూపొందించండి



మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: గడిచిన 15ఏళ్లకు సంబంధించిన ప్రభుత్వ భూముల జాబితాలు రూపొందించాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు అన్ని కొనసాగించాలని, వైద్యం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్ పనులు ఆగరాదన్నారు. క్షేత్ర స్థాయిలో తనిఖీ, విచారణలు, పర్యవేక్షణలు కొనసాగాలని సూచించారు. పరిపాలనా అనుమతులు లేని పనులు నిలిపివేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యాన్ని అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఓబీఎంఎస్‌లో పెండింగ్ లేకుండా చూడాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించాలన్నారు. పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో అవసరమైన పోలింగ్ సిబ్బంది డేటాను తక్షణమే సేకరించాలని, ఇందుకు డీటీఓ, జిల్లా అధికారుల ద్వారా సమాచారాన్ని సేకరించి సిద్ధం చేయాలని డీపీఓను ఆదేశించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు పరిష్కరించండి

ఓటరు జాబితా సవరణలో భాగంగా నవంబర్ 10వ తేదీ నుంచి ఇప్పటి వరకు వచ్చిన అభ్యంతరాలు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ ఈఆర్వోలు, ఏఈఆర్వోలను ఆదేశించారు. ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, పరిష్కారం, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, శుద్ధమైన ఓటరు జాబితా రూపకల్పన తదితర అంశాలపై సూచనలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల కారణంగా నవంబర్ నుంచి వచ్చిన అభ్యంతరాలను ఇప్పటివరకు పరిష్కరించలేదని, సుమారు 7వేలకు పైగా ఉన్న అన్ని రకాల అభ్యంతరాలను తక్షణమే పరిష్కరించడంపై తహసీల్దార్లు దృష్టి పెట్టాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలు 2 కిలోమీటర్ల దూరంలోపే ఉండేలా చూడాలన్నారు. 1,450 ఓటర్లకు మించి ఉన్న చోట ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించాలన్నారు. ఒక ఇంటిలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో వచ్చేలా చూడాలని, ఓటరు జాబితాలో ఇంకా ఏమైనా తప్పులు ఉంటే వాటిని సవరించుకుని జాబితాను తయారు చేయాలన్నారు. జడ్చర్ల ఈఆర్వో మోహన్‌రావు, మహబూబ్‌నగర్ ఆర్డీఓ అనిల్‌కుమార్, నటరాజ్, తహసీల్దార్లు వీసీకి హాజరయ్యారు.

ఎంవీఎస్ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అమెజాన్ డెవలప్‌మెంట్ కోర్సుపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు చదువులు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు పొందాలంటే ఇలాంటి శిక్షణలు తీసుకోవడం చాలా అవసరం అని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శివలీల, సత్యనారాయణగౌడ్, ట్రైనర్ షేక్ హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షలు ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ సెమిస్టర్ 1, 3, 5 సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు 35 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పీయూ అధికారులు నాగభూషణం, శాంతిప్రియ తనిఖీలు చేశారు. ఎంవీఎస్ కంట్రోలర్ రాములు, మల్లికార్జున్ తదితరులు పర్యవేక్షించారు.

గుప్తనిధుల పేరుతో గాలం

మంత్రశక్తులు ఉన్నాయంటూ అమాయకులకు ఎర

- సత్యనారాయణే 11 మందిని చంపినట్లు పోలీసుల వెల్లడి
- సైకో కిల్లర్ ఆగడాలను ముందే చెప్పిన 'సాక్షి'
- పోలీసుల విచారణలో జాప్యంపై విమర్శలు
- లోతుగా పరిశీలిస్తే మరిన్ని ఘటనలు వెలుగులోకి వచ్చే అవకాశం



నిందితుడు సత్యనారాయణ

సాక్షి, నాగర్‌కర్నూల్: గుప్తనిధులు వెలికితీస్తానంటూ అమాయకుల ఆస్తులకు ఎసరు పెట్టి.. ఆ తర్వాత ప్రాణాలు తీస్తున్న నరహంతకుడు రామట్టి సత్యనారాయణ యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం నాగర్‌కర్నూల్‌లోని ఎస్పీ కార్యాలయంలో డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ నిందితుడి అరెస్టు చూపి విలేకరులకు వివరాలను వెల్లడించారు. నిందితుడు సత్యనారాయణయాదవ్ ఇప్పటి వరకు మొత్తం 11 మందిని హత్యచేసినట్టుగా తెలిపారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు అమాయకులను రప్పించి అక్కడే హత్య చేసినట్టు నిర్ధారించారు. వీరిలో కొంతమంది మృతదేహాల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. పూర్తిస్థాయి విచారణ తర్వాత మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.



నిందితుడి నుంచి సేకరించిన హత్యకు గురైన బాధితుల ఫోన్లు, ఇతర వస్తువులు

మంత్రాల పేరుతో బురిడీ..

నాగర్‌కర్నూల్‌లోని ఇంద్రానగర్‌లో నివాసం ఉండే రామట్టి సత్యనారాయణ తన తండ్రి, తాతల నుంచి పాము, తేళ్లు కుట్టిన వారికి మందు వేయడం, మంత్రాలు వేసే సంప్రదాయాన్ని వారసత్వంగా కొనసాగిస్తున్నాడు. తర్వాత తన మంత్రశక్తితో గుప్తనిధులను వెలికితీస్తానని, కుటుంబ సభ్యుల సమస్యలు పరిష్కరిస్తానని అమాయకులను నమ్మిస్తున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నానని, ప్లాటు కొనిస్తానని, లేదా కొంటానంటూ కొత్తవారితో మాటలు కలిపి పరిచయం పెంచుకుంటాడు. తర్వాత గుప్తనిధుల ఆశజూపి వారి పేరిట ఉన్న ప్లాట్లు, భూములను తన పేరిట, బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత వారిని నిర్మానుష్య ప్రాంతాలకు రప్పించి జిల్లేడు పాలు, చెట్ల మందులతో విషం ఇచ్చి, అపస్మార స్థితిలోకి వెళ్లాక బండరాళ్లతో మోది హత్యచేస్తాడని పోలీసులు వెల్లడించారు.

■ నాగర్‌కర్నూల్ జిల్లాలోని కోడేరు మండలం తీగలపల్లికి చెందిన భీంరెడ్డి రాంరెడ్డి, ఆయన కూతురు తిరుపతమ్మ జిల్లాకేంద్రంలోని సంతబజార్ సమీపంలో నివాసం ఉంటున్నారు. అయితే తండ్రీకూతుళ్లు ఇద్దరూ సత్యనారాయణ చేతుల్లో బలయ్యారు. రాంరెడ్డిని గుప్తనిధుల పేరుతో ఏపీలోని అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూర్ వద్దకు తీసుకెళ్లి హతమార్చాడని, ఆయన కూతురు తిరుపతమ్మను కర్ణాటకలోని బలగనూర్ వద్ద హత్య చేశాడని తెలిసింది. ఆమెతో వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య చేశాడన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసుల విచారణ చేపడితే పూర్తి వివరాలు బయటపడే అవకాశం ఉంది. అయితే పోలీసుల విచారణ తీరుపై పలువురు విమర్శలు వస్తున్నాయి. అలాగే గతంలోనే 'సాక్షి' కథనం ప్రచురించిన సమయంలోనే స్పందించి ఉంటే బాగుండేదన్న అభిప్రాయపడుతున్నారు.



ఆరేపల్లి శ్రీనివాసులు (ఫైల్)

■ కొత్త వ్యక్తులకు సత్యనారాయణ తాను రియల్ ఎస్టేట్ వ్యాపారిగా పరిచయం చేసుకుంటాడు. ఆ తర్వాత తనకు మంత్రశక్తులు ఉన్నాయంటూ నమ్మిస్తాడు. ఈ క్రమంలో జిల్లాలోని కొల్లాపూర్ మండలం ముక్కిడిగుండం గ్రామానికి చెందిన ఆరేపల్లి శ్రీనివాసులుకు తాను రియల్‌ఎస్టేట్ వ్యాపారినంటూ సంప్రదించినట్లు తెలిసింది. ప్లాటు అమ్మిస్తా.. తనతో రావాలని సత్యనారాయణ ఫోన్ చేసి పిలిచేవాడని బంధువులు చెబుతున్నారు. 2021 డిసెంబర్ 23న శ్రీనివాసులు కొల్లాపూర్ మండలం నర్సింగాయిపల్లి శివారులో కాల్వ పక్కన విగతజీవిలా కనిపించాడు. శ్రీనివాసులు హత్యతో సత్యనారాయణకు సంబంధం ఉందని పోలీసులు నిర్ధారించారు.

■ కల్వకుర్తి మండలం తిమ్మరాసిపల్లికి చెందిన సంపతి శ్రీధర్‌రెడ్డి వ్యాపారంలో నష్టం రావడంతో సత్యనారాయణను సంప్రదించాడు. ఆయనకు గుప్తనిధుల ఆశ జూపిన మాంత్రికుడు సత్యనారాయణ నల్లమలలోని అమ్రాబాద్ ప్రాంతానికి రప్పించి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. అయితే ఇప్పటివరకు శ్రీధర్‌రెడ్డి మృతదేహం ఆచూకీ దొరకలేదు.

■ ఇటీవల వీపనగండ్ల మండలం బొల్లారానికి చెందిన వెంకటేశ్ హత్యకు గురయ్యాడు. దీంతో గత నెల 26న వెంకటేశ్ భార్య లక్ష్మి ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన పోలీసులు విచారణ చేపట్టారు. అనుమానితుడిగా ఉన్న సత్యనారాయణయాదవ్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా.. అలసు వరుస హత్యల విషయం బయటపడింది. నిందితుడు సత్యనారాయణ లింకులపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపితే మరింత మంది బాధితులు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



లింగస్వామి






నాగపూర్‌లో హత్యకు గురైన కుటుంబసభ్యులు హాజిరాబీ, ఆస్మాబేగం, ఖాజా, ఆశ్రీన్

■ 2020 ఆగస్టు 14న వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగపూర్‌లో గుప్త నిధుల తవ్వకాల పేరుతో ఒకే ఇంట్లో నలుగురిని హత్య చేశాడు. ఇదే నాగర్‌కర్నూల్ మండలం ఎండబెట్లకు చెందిన సలీం పాషా, గన్యాగులకు చెందిన లింగస్వామి సైతం నరహంతకుడి చేతిలో బలయ్యారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి

- వేరుశనగ పంటకు వేసిన కంచెకు తగిలి ప్రమాదం


వెంకటేశ్వర్లు (ఫైల్)

బల్మూర్: పందుల బెడద నుంచి వేరుశనగ పంటను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి ఓ రైతు మృతిచెందాడు. మండలంలోని మైలారంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. గ్రామానికి చెందిన రైతు కానమోని వెంకటేశ్వర్లు(53) తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట సాగు చేశాడు. ఈ క్రమంలో వ్యవసాయ పొలం వద్దకు మంగళవారం ఉదయం వెళ్లగా సమీపంలోని జంగ తిరుపతయ్య అనే రైతు తన వేరుశనగ పంటను పందుల బెడద నుంచి కాపాడుకునేందుకు అక్రమంగా విద్యుత్ కంచె ఏర్పాటు చేశాడు. అయితే రైతు వెంకటేశ్వర్లు దీనిని గమనించకపోవడంతో విద్యుత్ తీగలు కాలుకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. తర్వాత చుట్టుపక్కల పొలాల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకుని బోరున విలపించారు. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు భార్య సుల్తానమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని గ్రామస్తులు కోరారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు బోల్తా యువకుడు మృతి


రమేష్ నాయక్ (ఫైల్)

కొత్తకోట రూరల్: కారును అతివేగంగా నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం పాలెం ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా నర్వ మండలం జంగంరెడ్డిపల్లి తండాకు చెందిన చవాన్ రమేష్ నాయక్(31) హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా మంగళవారం మధ్యరాత్రి నిద్రమత్తుతో పాటు కారు అతివేగంగా ఉండటంతో పాలెం బ్రిడ్జి దాటిన తర్వాత కారు డివైడర్‌ను ఢీకొనడంతో బోల్తా పడింది. కారులో ఉన్న చవాన్ రమేష్ నాయక్ కారులో నుంచి ఎగిరిపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వాహనదారుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయక్‌ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అన్న రాజేష్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

ఉండవెల్లి: మద్యానికి బానిసై ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఉండవెల్లి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాల్‌రాజు వివరాల మేరకు.. కడప జిల్లా కమలాపురం గ్రామానికి చెందిన గోసుల వెంకటకుమార్ (30) తన భార్య జ్యోతితో కలిసి ఉండవెల్లిలో నర్సరీ ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో జ్యోతి స్వగ్రామానికి వెళ్లిపోయింది. నర్సరీ కూడా దిగుబడి రాకపోవడంతో వెంకటకుమార్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అధికంగా మద్యం తాగి మృతి చెందగా.. గమనించిన పొలం యజమాని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ఆత్మకూర్: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ నరేందర్ మంగళవారం తెలిపారు. స్థానిక సాయివెంకటేశ్వర సప్లయర్స్ ఎదురుగా సోమవారం రాత్రి నిద్రించిన వ్యక్తి అనారోగ్యంతో చలికి తట్టుకోలేక మృతి చెంది ఉంటాడని ఎస్‌ఐ వివరించారు. గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చామని తెలిపారు. అతనివద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని, గురించిన వారు 8712670630, 8712670631 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


రాములు (ఫైల్)

మదనాపురం: వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని రామన్‌పాడుకు చెందిన తెలుగు రాములు (28) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్‌లోని శివరాంపల్లిలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్న రాములు.. జేసీబీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఎన్నికల సమయంలో ఓటు వేసేందుకు భార్యాపిల్లలతో కలిసి స్వగ్రామానికి వచ్చిన అతడు.. భార్యను ఇంటి వద్దే వదిలిపెట్టి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా.. ఇంటి యజమాని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఆధ్యాత్మిక ముసుగులో కొత్త వ్యాపారం

అలంపూర్ ఆలయాల్లో పితృదోష నివారణ పూజలు

- భక్తుల బలహీనతను ఆసరా చేసుకొని పేట్రేగుతున్న మాఫియా
- సామాజిక మాధ్యమాలే వేదికగా ప్రచారం
- చోద్యం చూస్తున్న దేవాదాయ, పోలీసుశాఖ


అలంపూర్‌లోని పాపనాశిని ఆలయాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలు అంటే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తెలియనివారు ఉండరు. ప్రస్తుతం ఇక్కడ పితృదోషాలు.. శ్మశాన నారాయణుడి పూజలంటూ అమాయక భక్తులను నమ్మించి డబ్బులు దండుకొనే మాఫియా (కొందరు ఇంటి దొంగలు) ఒకటి తయారైంది. అలంపూర్‌లో శ్మశాన నారాయణుడు ఉన్నాడని.. పూజలు చేయడంతో పితృదోషాలు తొలగిపోతాయంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఈ మాఫియా వీడియోలు చేసింది. దేవాదాయశాఖ పరిధిలోని పాపనాశేశ్వర ఆలయం దగ్గర జరుగుతున్న పితృదోషాలు, శ్మశాన నారాయణుడి కథలు యూట్యూబ్‌లో వైరల్ కావడమే ఇందుకు నిదర్శనం. దీనిపై 'సాక్షి' అందిస్తున్న కథనం..

6వ శతాబ్దం నాటి అలంపూర్ ఆలయాల ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన మహానుభావుడు డా. గడియారం రామకృష్ణశర్మ. ఆలయ చరిత్రపై ఎన్నో పరిశోధనలు చేసి పలు పుస్తకాలు, గ్రంథాల రూపంలో బాహ్య ప్రపంచానికి అందజేశారు. నేడు కేంద్ర పురావస్తుశాఖ సైతం ఆయన రచనల ఆధారంగానే అనేక విషయాలు సేకరించారు. కానీ పురావస్తుశాఖ, ఇటు గడియారం రామకృష్ణశర్మ రచించిన గ్రంథాలు, పుస్తకాల్లో ఎక్కడా కనిపించని శ్మశాన నారాయణుడు.. పితృదోషాలు అంటూ కట్టు కథలకు రూపకల్పన చేసిన ఓ మాఫియా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడం ప్రారంభించింది. ఈ పూజల పేరిట భక్తుల నుంచి ఇష్టానుసారంగా డబ్బులు వసూలు చేస్తూ సరికొత్త వ్యాపారానికి తెర తీశారు. చివరకు జోగుళాంబ ఆలయ విశిష్టతను సైతం కనుమరుగు చేసేలా ప్రచారం చేస్తున్నారంటే ఆశ్చర్యం కలగక మానదు.

కట్టుకథలతో మభ్యపెట్టి..

తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులు ఎలాగైతే పిల్లలకు చెందుతాయో.. వారు చేసిన పాపపుణ్యాలు కూడా వారి పిల్లలకు చేరుతాయని, వివాహాలు కాకపోవడం, భార్యాభర్తల మధ్య తగాదాలు, సంతానం కలగకపోవడం, బుద్ధిమాంద్యం గల పిల్లలు జన్మించడం, దీర్ఘకాల రోగాలు, తరచూ అవమానాలకు గురి కావడం, అప్పుల పాలు కావడం, కోర్టు కేసులు తదితర సమస్యలే ఇందుకు నిదర్శనమని ప్రచారం ప్రారంభించారు. ఇక్కడి పాపనాశేశ్వర ఆలయంలో ఉండే గధాధరుడి విగ్రహానికి (ఇప్పటి కొత్త పేరు శ్మశాన నారాయణుడు) ప్రత్యేక పూజలు నిర్వహించి పాయసం, వడలు నైవేద్యంగా సమర్పించడంతో ఇలాంటి దోషాలు తొలగిపోతాయని కొత్త కథలు చెబుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఇక్కడ శ్మశాన నారాయణుడి ఆలయం ఉన్న విషయం స్థానికులకే తెలియదని.. రోజు సాయంత్రం 12 అడుగుల పాము ఇక్కడి శివలింగానికి చుట్టుకుంటుందని చెబుతూ అమాయక భక్తులను బురిడీ కొట్టిస్తున్నారు. యూట్యూబ్ వేదికగా వీరు తమ హావభావాలతో చెప్పే కట్టుకథలు వింటే ఇదంతా నిజమేనేమో అన్నట్టుగా ఉంటోంది.



గదాధారుడిని శ్మశాన నారాయణుడిగా మార్చి..

గదాధారుడి విగ్రహం గురించి డా. గడియారం రామకృష్ణశర్మ తన పరిశోధనల్లో ఎంతో చక్కగా వర్ణించారు. కాని ఇక్కడి మాఫియా మాత్రం గదాధారుడిని శ్మశాన నారాయణుడిగా నామకరణం చేసి 'కేరళ తంత్రం'లో పితృదోషాలపై రాశారంటూ చరిత్రను సైతం మార్చి కొత్త చరిత్రను తెరపైకి తెచ్చారు. సాధారణంగా తీర్థాల పక్కన ఉన్న నదిలో అస్తికలు కలపడం, పుష్కరాల సమయంలో పిండప్రదానాలు చేయడం సహజం. దీనిని ఆసరాగా చేసుకొని ఇక్కడి మాఫియా శ్మశాన నారాయణుడు.. పితృదోషాలంటూ కల్పిత కథలు సృష్టించి అమాయక భక్తుల నుంచి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ విషయం గురించి పలువురు భక్తులు ఆలయ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు.

కట్టు కథలను నమ్మొద్దు..



ఇక్కడ శ్మశాన నారాయణుడు అనే పేరేలేదు. కొందరు స్వార్థపరులు గధాధరుడి విగ్రహానికి శ్మశాననారాయణుడు, మరకత లింగం అని నామకరణం చేశారు. మరకతం అంటే చాలా విలువైన మణి. నిజంగా మరకతమైతే ఆ విషయాన్ని పురావస్తుశాఖ అధికారులు స్పష్టం చేస్తారు. ఇక్కడి చరిత్రకు మూలమైన స్కంద పురాణం, గడియారం వారి పుస్తకాల్లో కనిపించని పేర్లతో కట్టు కథలు చెబుతూ భక్తులను మోసగించే వారిపై చర్యలు తీసుకోవాలి.

– ఆనంద్‌శర్మ, ముఖ్య అర్చకుడు, అలంపూర్ ఆలయాలు

బూటక ప్రచారం..



శ్మశాన నారాయణుడు, పితృదోషాల పూజల గురించి తెలుసుకునేందుకు రోజు అనేక మంది ఫోన్లు చేస్తు న్నారు. ఇది అవాస్తవమని చె ప్పినా నమ్మని రీతిలో బూటక ప్రచారం చేశారు. ఇక్కడి పండితులు, అర్చకులను అడిగినా వాస్తవం కాదనే చెబుతున్నారు. ఈ బూటకపు ప్రచారం వెనుక ఉన్న ఇంటి దొంగలపై త్వరలో చర్యలు తీసుకుంటాం.

–పురేందర్‌కుమార్, ఈఓ, అలంపూర్ ఆలయాలు

భక్తులను జాగృతం చేస్తాం..



హిందూ ధర్మానికి తూట్లు పొడిచేలా ఇలాంటి మోసకారులతో నిజమైన భక్తుల విశ్వాసాలు సన్నగిల్లుతున్నాయి. ఇలాంటి మోసాలతో ధర్మం దెబ్బతింటుంది. సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న ఈ అసత్య ప్రచారాలను హిందు జనశక్తి అడ్డుకుని భక్తులను జాగృతం చేస్తాం.

– లలిత్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, హిందు జనశక్తి

పెద్దల హస్తంపై అనుమానం?

ఈ మాఫియా వెనక పెద్ద తలకాయల హస్తం కూడా ఉందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. గతంలో ఈ పూజలను అడ్డుకునేందుకు యత్నించిన అప్పటి ఆలయ ఈఓ ప్రేమ్‌కుమార్ నాటి ఎమ్మెల్యేతో చివాట్లు పడాల్సి వచ్చింది. తమ వ్యాపారాన్ని అడ్డుకుంటే ఈఓ పేరిట లేఖ రాసి ఆలయంలో ఉరి వేసుకుంటామంటూ మాఫియా భయపెట్టడంతో చేసేది లేక మాఫియాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కల్వకుర్తిలో ప్రొటోకాల్ వివాదం

- డీఎంపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

కల్వకుర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలలో భాగంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రారంభోత్సవంలో ఆర్టీసీ డీఎం ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమాన్ని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. సోమవారం కల్వకుర్తి వచ్చిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆస్పత్రిలో కార్యక్రమం ముగించుకొని వెళ్లారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సత్యం, ఎంపీపీ మనోహర అనుచరులతో కలిసి కార్యక్రమానికి పిలకపోవడంపై అడిగేందుకు ఆర్టీసీ డిపోకు వెళ్లి మేనేజర్ శ్రీకాంత్‌ను నిలదీశారు. అయితే మేనేజర్ ఎలాంటి సమాధానం చెప్పకుండా ఫోన్‌ను చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో అసహనానికి గురైన డిపో మేనేజర్ వారిని వీడియో చిత్రీకరించడంతో.. ఒక నాయకుడు ఉద్యోగం చేయాలనుకుంటే చేయండి.. లేదంటే రాజీనామా చేసి రాజకీయం చేయాలని గట్టిగా హెచ్చరించడంతో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అంతలోనే మేనేజర్ ఓ మహిళా ప్రజాప్రతినిధినిపై అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆరోపించారు. ఇదే విషయమై మహిళా ప్రజాప్రతినిధి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై కల్వకుర్తి ఎస్‌ఐ రమేష్‌ను వివరణ కోరగా మహిళా ప్రజాప్రతినిధి నుంచి ఓ ఫిర్యాదు వచ్చిందని, పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జడ్చర్ల: తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ కథనం ప్రకారం.. హౌసింగ్‌బోర్డు కాలనీలో సుమలత అనే మహిళ తన కుమారుడితో కలిసి ఉంటుంది. కుమారుడు ఉద్యోగం నిమిత్తం ఇతర ప్రాంతానికి వెళ్లడంతో ఆమె ఒంటరిగా పడుకోవడానికి భయపడి ఇంటికి తాళాలు వేసి పక్క ఇంటిలోకి వెళ్లి పడుకుంది. మంగళవారం ఉదయం తన ఇంటికి వచ్చి చూడగా తాళాలు విరగ్గొటి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లిన దొంగలు ఒక తులం బంగారంతో పాటు 30 తులాల వెండి ఆభరణాలు, రూ.25 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంట్లో సీసీ కెమెరాలు ఉండగా వాటి హార్డ్ డిస్క్ ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

హన్వాడ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మంగళవారం మృతిచెందినట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని టంకరకు చెందిన శివకుమార్ (23) సొంత పని నిమిత్తం ఇబ్రహీంబాద్‌కు బైక్‌పై వెళ్లాడు. పని ముగించుకొని తిరిగి గ్రామానికి వస్తుండగా కర్ణాటక నుంచి వస్తున్న డీసీఎం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శివకుమార్‌ను వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. శివకుమార్‌కు భార్య మాధురి, ఓ కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు డీసీఎం డ్రైవర్ రవూఫ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

పాల బిల్లులు ఎవరిస్తారు?

- పాడిరైతుల ఆందోళన
- ఒకరిపై ఒకరు నెట్టేస్తున్న విజయ డెయిరీ అధికారులు


జడ్చర్లలోని బీఎంసీయూ వద్ద ఆందోళన చేస్తున్న రాజాపూర్ మండల పాడి రైతులు

రాజాపూర్: జీవనోపాధికోసం అప్పులు చేసి పాడి ఆవులు, గేదెలు తెచ్చుకుని పాలపైనే ఆధారపడి జీవిస్తున్న పాడిరైతులకు మూడునెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో చివరికి వారు ఆందోళనకు దిగుతున్నారు. రాజాపూర్ మండలంలోని బీబీనగర్, నవాబ్‌పేట్ మండలంలోని కూచూర్, దొడ్డిపల్లితో పాటు జడ్చర్ల మండలానికి చెందిన పాడిరైతులు సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో జడ్చర్లలోని ప్రభుత్వ విజయ డెయిరీ ఆధ్వర్యంలో నడుస్తున్న బీఎంసీయూకు 48,317 లీటర్ల పాలను పంపించారు. అయితే బీఎంసీయూ పాలను హైదరాబాద్‌లోని విజయ డెయిరీకి పంపించారు. వీటి బిల్లు ఇవ్వకపోవడంతో పాటు హైదరాబాద్‌లో పాలు ఎక్కువ అయ్యాయి. మీరు పాలు పంపించవద్దని రైతులపై ఒత్తిడి చేసి రైతుల పాలను తీసుకోవడం లేదు. దీనికి తోడు రైతులు తమ పాలను తీసుకోకపోయినా పర్వాలేదు.. మేము మీకు పోసిన పాలబిల్లు రూ.20.77లక్షలు ఇవ్వాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయంపై కలెక్టర్ రవినాయక్ దృష్టికి తీసుకువెళ్లారు. అంతలోనే ఎన్నికలు రావడంతో రైతులు మిన్నకుండి పోయారు. ఎన్నికలు ముగియడంతో బిల్లులు ఇవ్వాలని సంబంధిత డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్టు డైరెక్టర్‌లను విన్నవించినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు దిగుతున్నారు.

మా కష్టం వాళ్లకేమి తెలుసు



పగలు, రాత్రి అనక పాడిని నమ్ముకుని జీవించేవాళ్లం.. మా కష్టం విలువ వాళ్లకేమి తెలుస్తది. మూడు నెలలుగా పాలు పోసుకుని బిల్లు ఇవ్వడం లేదు. మేం మా పాడి ఆవులకు, గేదెలకు దాణా, పశుగ్రాసం కొనుక్కోవాలంటే మళ్లీ అప్పులు చేయాల్సి వస్తుంది. ఏసీ రూముల్లో ఉండే వాళ్లకు మా పాడి రైతుల బాధ ఏం తెలుస్తుంది.

– కిషన్ నాయక్, బీబీ నగర్, పాడి రైతు

పాడినే నమ్ముకుని జీవిస్తున్నాం..



మేం పాడిని నమ్ముకుని జీవిస్తున్నాం. పాలు తక్కువ ఉన్నప్పుడు డీడీ మా గ్రామాలకు వచ్చి పాలను పెంచండని, ప్రైవేటు డెయిరీలకు పాలుపోసి మోసపోకండని చెప్పి పోయింది. మేం ప్రభుత్వ డెయిరీకి పోస్తే అన్ని విధాల బాగుంటుందని పాలు పోస్తే బిల్లులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.

– గోవింద్, పాడి రైతు

మా చేతుల్లో ఏం లేదు



నాలుగు గ్రామాల పాడి రైతులకు సంబంధించి బిల్లు రూ.20లక్షలకు పైగా చెల్లించాల్సి ఉంది. రైతుల బ్యాంకు అకౌంట్‌లలో నేరుగా జిల్లా కేంద్రంలోని డెయిరీ నుంచే వారి ఖాతాల్లో వేస్తారు. మూడు నెలలుగా బిల్లులు అందని మాట వాస్తవం. మా చేతుల్లో ఏమి లేదు. విషయాన్ని జిల్లా అధికారులకు కూడా వివరించాం.

– వెంకట్‌రెడ్డి, బీఎంసీయూ మేనేజర్, జడ్చర్ల

త్వరలో అందేలా చూస్తాం

ఈ విషయంపై కలెక్టర్‌తో చర్చించి సమస్యను పరిష్కరించి పాడి రైతుల ఖాతాల్లో వారికి రావాల్సిన బిల్లులను చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– యాదయ్య, ప్రాజెక్టు డైరెక్టర్

హరూన్ బజాజ్ ఆధ్వర్యంలో స్టంట్ షో


స్టంట్ చేస్తున్న రైడర్లు

పాలమూరు: హరూన్ బజాజ్ షోరూం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని స్టేడియంలో హరూన్ బజాజ్ పల్సర్ మానియా 2.0 స్టాంట్ షో నిర్వహించారు. ఈ షోలో బైక్ రైడర్స్ పల్సర్ బైక్‌లతో పలు రకాల స్టాంట్స్ చేసి వాహనదారులను ఆకట్టుకున్నారు. ఈసందర్భంగా తెలంగాణ రీజనల్ మేనేజర్ సాయిహరి మాట్లాడుతూ బజాజ్ పల్సర్ 20ఏళ్లుగా దేశంలో నంబర్ వన్ బైక్‌గా నిలబడిందన్నారు. ఏడాది కాలంలో 10లక్షల బైక్‌లు విక్రయాలు సాధించి దేశంలో ఫేవరేట్ స్పోర్ట్స్ బైక్‌గా ఉందన్నారు. నిరంతరం పల్సర్‌ను కంపెనీ ఆధునీకీకరిచడం, వినియోగదారుల అభిరుచికి తగినట్లు తయారు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎండీ మహ్మద్ ఇసాక్, సూర్యకిరణ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు


ఆర్డీఓ అనిల్‌కుమార్‌తో వాగ్వివాదానికి దిగిన 523 సర్వేనంబర్‌లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేపట్టిన ప్రజలు

మహబూబ్‌నగర్ రూరల్: అర్బన్ మండలం క్రిష్టియన్‌పల్లి గ్రామ రెవెన్యూ ఆదర్శ నగర్‌లో గల 523 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని అనుమతులు లేకుండా ఆక్రమించడానికి ప్రయత్నించే వారిపై చర్యలు తప్పవని ఆర్డీఓ అనిల్ కుమార్ హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలు చేసుకున్న భూ ఆక్రమణదారులు మంగళవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈసందర్భంగా వారు ఆర్డీఓతో వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 523 సర్వేనంబర్‌లో ప్రభుత్వ భూమి అని, ఆ భూమిలో ఎట్టి పరిస్థితుల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణాలను చేపట్టరాదని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే ఆక్రమించిన వారు కూడా స్వచ్ఛందంగా వైదొలగాలని, లేనిపక్షంలో తామే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఇళ్ల పట్టాల కాలపరిమితి కేవలం ఆరు నెలలు మాత్రమేనని, ఆ ఆరు నెలల్లోపు ఇళ్ల నిర్మాణాలు చేపట్టకుంటే వాటి కాలపరిమితి ముగిస్తుందని, దాంతో అవి చెల్లబోవని తేల్చి చెప్పారు. స్థలాలపై హక్కులు పొందాలంటే తిరిగి అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకుంటే.. వాటిని పరిశీలించి అర్హుల జాబితాను రూపొందించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో ఆక్రమణదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ రాధాకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రాజగోపాల్, గిర్దావర్లు చైతన్య, నర్సింగ్ తదితరులు ఉన్నారు.

హార్వెస్టర్ దగ్ధం

గండేడ్: ప్రమాదవశాత్తు ఓ హార్వెస్టర్‌కు నిప్పంటుకుని దగ్ధమైన ఘటన గండీడ్ మండలం కొండాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. వికారాబాద్ జిల్లా దోమ మండలం ఐనాపూర్‌కు చెందిన సాయి తన హార్వెస్టర్‌ను వరికోతల నిమిత్తం కొండాపూర్‌కు తీసుకొచ్చారు. మూడు రోజుల కిందట మరమ్మతుకు గురికావడంతో గ్రామంలోనే నిలిపివేశారు. మంగళవారం ఉన్నట్టుండి హార్వెస్టర్ ఇంజిన్‌కు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు బోరుమోటరు సాయంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే హార్వెస్టర్ చాలా భాగం కాలిపోయింది. ప్రమాదంలో సుమారు రూ.5లక్షల నష్టం వాటిల్లిందని యజమాని సాయి తెలిపారు. ప్రమాదంపై తమకు అనుమానం ఉందని.. విచారణ నిర్వహించి న్యాయం చేయాలని మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు.


దగ్ధమవుతున్న హార్వెస్టర్

చెరుకు తోట దగ్ధం

అమరచింత: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు చెరుకు తోటలో తెగి పడటంతో నిప్పంటుకొని కాలిపోయిన సంఘటన మండలంలోని పాంరెడ్డిపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎల్లంపల్లి చిన్నారెడ్డి, కుర్వ గడ్డం నర్సింహులుకు చెందిన ఐదు ఎకరాల చెరుకు తోటలో విద్యుత్ తీగలు తెగిపడటంతో మంటలు చెలరేగాయి. విషయాన్ని గమనించిన చుట్టుపక్కల రైతులు ఫైర్ అధికారులకు సమాచారం అందించగా.. వారు వచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేయగా.. అప్పటికే సగభాగం కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల మేరకు పంట నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం, కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో 'పాలమూరు' ప్రతిభ


రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

- చాంపియన్‌గా నిలిచిన ఉమ్మడి జిల్లా బాలికల జట్టు
- మూడోస్థానాన్ని దక్కించుకున్న బాలుర జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: రంగారెడ్డి మేడ్చల్‌లోని కేఎల్ఆర్ స్టేడియంలో మంగళవారం జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో జిల్లా బాలికల జట్టు 3–0 ట్రైలు కొట్టి మెదక్‌పై విజయం సాధించింది. బాలుర విభాగంలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు రాణించడంపై ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్‌రావు, కోశాధికారి బాల్‌రాజు, కోచ్‌లు నర్సింలు హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో రానున్న టోర్నీల్లో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.


మూడోస్థానంలో నిలిచిన బాలుర జట్టు

క్లుప్తంగా...

జెన్‌కో ఏఈ పరీక్ష వాయిదా

'ప్రజావాణి'లో వచ్చిన విజ్ఞప్తిపై సర్కారు సానుకూల నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో నిరుద్యోగ అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు జెన్‌కో ఏఈ రాత పరీక్షను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. తెలంగాణ రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థ (జెన్‌కో)లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టుల భర్తీకి ఈ నెల 17న నిర్వహించతలపెట్టిన రాతపరీక్షను వాయిదా వేసినట్టు ఆ సంస్థ మానవ వనరుల విభాగం డైరెక్టర్ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు ఇతర సంస్థల/ప్రభుత్వ పోటీపరీక్షలు ఉండటంతో జెన్‌కో ఏఈ రాతపరీక్షను వాయిదా వేయాలని అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఏఈ పరీక్షల తదుపరి షెడ్యూల్‌ను సంస్థ వెబ్‌సైట్ www. tsgenco.co.inలో ప్రకటిస్తామన్నారు. జెన్‌కోలో ఏఈ(ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్) పోస్టుల భర్తీకి సంస్థ యాజమాన్యం అక్టోబర్ 4న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

హెరాయిన్ రవాణా కేసులో నిందితురాలికి పదేళ్ల జైలు శిక్ష

- జాంబియా దేశస్తురాలి నుంచి రూ. 20 కోట్ల విలువైన మత్తు పదార్థాలు స్వాధీనం
- 2021లో అరెస్ట్ చేసిన డీఆర్ఐ

సాక్షి, హైదరాబాద్: హెరాయిన్ అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నిందితురాలికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చినట్టు డీఆర్ఐ(డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్) అధికారులు తెలిపారు. ఈ మేరకు డీఆర్ఐ అధికారులు మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు. 2021 జూలై 19న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జాంబియా దేశస్తురాలి వద్ద నుంచి రూ.20.80 కోట్ల విలువైన 3200 గ్రాముల హెరాయిన్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్ సెక్షన్ 21, 23ల కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. నిందితురాలు తన సూట్‌కేసులో రహస్యంగా హెరాయిన్ దాచి అక్రమంగా రవాణా చేస్తున్నట్టు పూర్తి ఆధారాలను డీఆర్ఐ అధికారులు కోర్టుకు సమర్పించారు. కేసు నిరూపితం కావడంతో కోర్టు నిందితురాలికి పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలలు సాధారణ జైలు శిక్ష కొనసాగించాలని తీర్పులో వెల్లడించారు.

దొంగలు దూరారు!

టీడీపీ సానుభూతిపరులు.. పలు చోట్ల ఓటర్లుగా నమోదు

కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో 40.76 లక్షలకుపైగా బోగస్ ఓట్లు

- అధికార పార్టీ ఓటర్లపై గురి..కుప్పలు తెప్పలుగా ఫారం 7 దరఖాస్తులు
- విచారణ జరిపి ఆ దరఖాస్తులన్నీ నకిలీవని తేలుస్తున్న బీఎల్వోలు
- దీంతో ఎన్నికల యంత్రాంగంపై దాడులకు తెగబడుతున్న పచ్చమూకలు
- నకిలీ ఓట్లను కొనసాగించేందుకు 8 జిల్లాల్లో బ్లాక్‌మెయిల్ రాజకీయాలు



సాక్షి, అమరావతి: ఏపీలో నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి జగన్ అమలు చేస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో ప్రజాస్వామ్య ప్రక్రియపై విశ్వాసం కోల్పోయిన విపక్షం అడ్డదారులు పడుతోంది! ఏపీ వ్యాప్తంగా ఓట్ల దొంగలు స్వైర విహారం చేస్తున్నారు! అధికార పార్టీ చేపట్టిన సామాజిక సాధికారయాత్ర, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతుండటంతో వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమనే నిర్ణయానికి వచ్చిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు జనసేనతో చేతులు కలిపినా ఫలితం శూన్యమని గుర్తించారు. దీంతో 2019 ఎన్నికలకు మించి మరోసారి ఘోర పరాజయం తప్పదని పసిగట్టిన టీడీపీ పెద్దలు.. దొడ్డిదారి పట్టారు! తమకు మాత్రమే సాధ్యమైన వ్యవస్థలోకి వైరస్‌లా చొరబడి చాపకింద నీరులా ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లను చేర్పిస్తున్నారు.

40,76,580కిపైగా దొంగ ఓట్లు

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అక్టోబర్ 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లో 4,02,21,450 మంది ఓటర్లు ఉన్నట్లు ప్రకటించారు. ఇందులో సుమారు 40,76,580కిపైగా దొంగ ఓట్లను టీడీపీ నేతలు చేర్పించినట్లు ప్రజాసంఘాలు, రాజకీయ పరిశీలకులు గుర్తించారు. తమ పార్టీ సానుభూతిపరుల ఓట్లను పలు నియోజకవర్గాల్లో ఒకే ఫోటోతో ఇంటి పేర్లు మార్చి జాబితాలో చేర్పించారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటు హక్కు కలిగి ఉన్న తమ పార్టీ సానుభూతిపరుల పేర్లను సైతం రాష్ట్రంలోని ఓటర్ల జాబితాలో చేర్పించారు. ఒకే డోర్ నెంబర్‌పై వందల ఓట్లను నమోదు చేయించారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 46,165 పోలింగ్ బూత్‌ల పరిధిలోనూ ఇదే కథ.

ఇప్పటికీ దొంగ ఓట్లను నమోదు చేయించే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. మరో వైపు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు జీవించి ఉన్నా చనిపోయినట్లు, స్థానికంగా నివాసం ఉంటున్నా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు చిత్రీకరిస్తూ ఆ ఓట్లను తొలగించేందుకు కుప్పలు తెప్పలుగా ఫారం–7 దరఖాస్తులు సమర్పిస్తున్నారు. బీఎల్వోల (బూత్ లెవల్ ఆఫీసర్లు) విచారణలో ఇవన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

దాడులు.. బ్లాక్ మెయిల్

ఫారం 7లపై విచారణ జరిపి దొంగ ఓట్లను ఆధారాలతోసహా తేల్చి ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్న బీఎల్వోలు, తహసీల్దార్లపై టీడీపీ నేతలు దాడులకు దిగుతున్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో శావల్యపురం తహసీల్దార్‌పై నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ ఇటీవల దాడికి తెగబడ్డారు. తాము చేర్పించిన దొంగ ఓట్లను తొలగించకుండా కలెక్టర్లను సైతం టీడీపీ నేతలు బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. అనంతపురం, శ్రీకాకుళం, అంబేడ్కర్ కోనసీమ, గుంటూరు, అన్నమయ్య, బాపట్ల, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాల కలెక్టర్లపై ఇటీవల రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి టీడీపీ నేతలు ఫిర్యాదు చేయడమే అందుకు నిదర్శనం.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నాడు.. ఐదు లక్షల దొంగ ఓట్లతో

రాష్ట్ర విభజన తర్వాత 2014 ఎన్నికల నాటికి ఓటర్ల జాబితాలో సుమారు 35 లక్షలకుగా దొంగ ఓట్లు ఉన్నట్లు ప్రజాసంఘాలు గుర్తించాయి. ఆ ఎన్నికల్లో కేవలం ఐదు లక్షల ఓట్ల తేడాతో టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ దొంగ ఓట్లను తొలగించి ఉంటే 2014లోనే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి ఉండేదని అప్పట్లోనే ప్రజా సంఘాలు, రాజకీయ పరిశీలకులు తేల్చిచెప్పారు.

గెలుపు వ్యూహం మాకు తెలుసు

- టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలి: సజ్జల
- ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే క్లారిటీ లేదు
- మరింత మెరుగైన ఫలితాల కోసమే మార్పుచేర్పులు



సాక్షి, అమరావతి: టీడీపీ – జనసేన ముందు వాటి ఇల్లు చక్కదిద్దుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హితవు పలికారు. ఇంతవరకూ ఎన్ని స్థానాల్లో పోటీ చేయాలో వారికే స్పష్టత లేదని వ్యాఖ్యానించారు. టీడీపీ శిథిలావస్థకు చేరిన సౌధమని, పవన్‌ను నమ్ముకొని చంద్రబాబు ప్రయాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గెలుపు అవకాశాలను మెరుగుపరుచుకుని మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకే మార్పుచేర్పులు చేపట్టామని, అది తమ పార్టీ అంతర్గత వ్యవహారమన్నారు. నియోజక వర్గాల్లో నాయకుడిని మార్చినప్పుడు క్యాడర్ కొత్త ఇబ్బంది పడటం సహజమేనని, అందరినీ పిలిచి మాట్లాడతామని చెప్పారు. అందరినీ సమన్వయ పరుచుకుంటూ, సముచిత స్థానం కల్పిస్తూ ముందుకు వెళ్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా గెలవాలో.. అందుకు ఏ వ్యూహం అనుసరించాలో తమకు తెలుసన్నారు. కుప్పం సహా 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు.

నిరంతరం ప్రజాసేవలోనే..

బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజక వర్గాల్లో బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థులను బరిలోకి దింపకుండా చంద్రబాబు, లోకేశ్ ఎందుకు పోటీ చేస్తున్నారని సజ్జల ప్రశ్నించారు. 3 వేల కి.మీ. పాదయాత్ర పూర్తి చేశాడని టీడీపీ గొప్పులు చెప్పుకుంటున్న లోకేశ్ ఎక్కడ నడిచాడో ఎవరికీ తెలియటం లేదని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ పేరు ప్రస్తావించే అర్హత కూడా లోకేశ్‌కు లేదన్నారు. ఇప్పటివరకు 99.5 శాతం హామీలను నెరవేర్చి సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలిపారు. రెండేళ్ల ముందు నుంచే ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో గడప గడపకూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నిరంతరం ప్రజాసేవలో నిమగ్నం చేశారని చెప్పారు. ప్రజల ఆశలు నెరవేర్చే నేతగా సీఎం జగన్ ఆదరణ చూరగొన్నారని, పాజిటివ్ ఓటు తమ బలమని పేర్కొన్నారు.

కేసులపై బయటెక్కడా మాట్లాడొద్దు

చంద్రబాబుకు సుప్రీంకోర్టు ఆదేశం

- స్కిల్ కేసుతోపాటు ఫైబర్‌నెట్ కేసుకూ ఇది వర్తిస్తుంది
- ఫైబర్‌నెట్ కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ వచ్చే నెల 17కి వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు తనపై ఉన్న కేసుల గురించి బహిరంగంగా ఎక్కడా మాట్లాడవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు సూచించింది. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసే కాకుండా ఫైబర్‌నెట్ కేసుకు కూడా ఇది వర్తిస్తుందని తేల్చిచెప్పింది. ఫైబర్‌నెట్ కుంభకోణానికి సంబంధించి చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా సీఐడీ తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో బెయిల్ విషయాన్ని ప్రస్తావించారు. 'స్కిల్'కేసులో తానెలాంటి రాజకీయ ప్రకటన చేయనని చెప్పిన చంద్రబాబు డిసెంబర్ 8న దాన్ని ఉల్లంఘించారని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. ఇలాంటివి ఏమున్నా రికార్డు రూపంలో కోర్టుకు అందజేయాలని ధర్మాసనం పేర్కొంది. ఈ సమయంలో సిద్ధార్థ లూథ్రా జోక్యం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు గురించి చెప్పాల్సింది చాలా ఉందన్నారు. అనంతరం ఫైబర్‌నెట్ కేసు విచారణను జనవరి 17కి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది. కోర్టు మౌఖికంగా గతంలో చెప్పింది (ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబుని అరెస్టు చేయబోమని) కొనసాగుతుందా అని లూథ్రా ధర్మాసనాన్ని కోరగా అవునని తెలిపింది. ఈ దశలో రంజిత్ కుమార్ జోక్యం చేసుకొని అయితే కేసులపై చంద్రబాబు ఎలాంటి ప్రకటన చేయరాదని కోరారు. ఈ బాధ్యత లూథ్రాదేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమకు బాధ కలిగించేది కాబట్టే ఇలా అడుగుతున్నామని రంజిత్ కుమార్ కోర్టు దృష్టికి తెచ్చారు. ''మీ క్లయింట్ కేసు గురించి ఎలాంటి ప్రకటన చేయకూడదు''అని లూథ్రానుద్దేశించి జస్టిస్ బోస్ వ్యాఖ్యానించారు. 'స్కిల్'కేసులో పరిమిత ఆదేశాలు ఉన్నాయని.. వాటిని గౌరవిస్తున్నామని లూథ్రా పేర్కొన్నారు. ఏదేమైనప్పటికీ దగ్గరలో ఎన్నికలు లేవు కదా అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఏపీ అదనపు అడ్వొకేట్ జనరల్ కేసు గురించి ప్రకటనలు చేయడమే కాకుండా హైదరాబాద్, ఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారని, తన గురించి కూడా మాట్లాడారని లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే రికార్డు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసులో తీర్పు కోసం ఎదురుచూడడానికి వాయిదా పడిన మరో కేసులో సంయమనంతో ఉండాలని లూథ్రా అంటున్నారని రంజిత్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండువైపులా జెంటిల్‌మెన్ వ్యవహారం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

175 స్థానాల్లో విజయమే లక్ష్యం

- కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు, చేర్పులు
- పార్టీకోసం పనిచేసేవారికి సీటు: వై.వి.సుబ్బారెడ్డి



సాక్షి, అనకాపల్లి: ఏపీలో 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా తమ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కొన్ని మార్పులు, చేర్పులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. కొన్ని నియోజకవర్గాల్లో పరిస్థితుల దృష్ట్యా మార్పులు చేస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రంలో 12 నియోజకవర్గాల్లో పలువురు ఎమ్మెల్యేలకు స్థానచలనం, నూతన ఇన్‌చార్జిలను నియమించారని తెలిపారు. ఆయన మంగళవారం అనకాపల్లి జిల్లా రోలుగుంటలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీలో చాలా మార్పులు ఉండనున్నాయన్నారు. ఇప్పటికే విశాఖ జిల్లాలో గాజువాక నియోజకవర్గంలో సమన్వయకర్తని మార్చామని చెప్పారు. రెండువారాల కిందటే స్థానిక ఎమ్మెల్యే నాగిరెడ్డికి తెలిపామన్నారు. తమకు సీటు ఇచ్చినా, ఇవ్వకపోయినా ఈ రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్న లక్ష్యంతో తాము పనిచేస్తామని ఎమ్మెల్యే నాగిరెడ్డి, ఆయన తనయుడు దేవన్‌రెడ్డి చెప్పారని తెలిపారు. అంతేగాకుండా పార్టీలో కష్టపడి పనిచేసే మంచి అభ్యర్థికి సీటు ఇవ్వమని కూడా వారు సూచించారన్నారు. వీరిద్దరూ రాజీనామా చేశారనేది దుష్ప్రచారం మాత్రమేనని చెప్పారు. విశాఖ పార్టీ కార్యాలయంలో మంగళవారం స్వయంగా దేవన్ రాజీనామా వార్తను తోసిపుచ్చారని తెలిపారు.

శిక్షణ పొందేదెలా?



జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియం

- క్రీడారంగాన్ని వేధిస్తున్న కోచ్‌ల కొరత
- ఏళ్ల తరబడి భర్తీకాని ఖాళీలు
- స్టేడియాలు ఉన్నా కోచ్‌లు లేక అరకొరగా శిక్షణ

మహబూబ్‌నగర్ క్రీడలు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో క్రీడారంగాన్ని కోచ్‌ల కొరత వేధిస్తోంది. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న స్టేడియాలలో సరిపడా కోచ్‌లు లేకపోవడం క్రీడాకారులకు శాపంగా మారుతోంది. 2007 నుంచి స్టేడియాలలో శాశ్వత పద్ధతిన కోచ్‌లను నియమించకపోవడం.. ప్రస్తుతమున్న కోచ్‌లు కూడా తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్నారు.



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలోని షటిల్ కోర్టులు

స్టేడియాలలో సరిపడా కోచ్‌లు లేకపోవడంతో ఔత్సాహిక క్రీడాకారులు మెరుగైన శిక్షణకు దూరమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి..

ఉమ్మడి జిల్లాలో 13 స్టేడియాలు ఉండగా.. కేవలం 8మంది కోచ్‌లు మాత్రమే ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరుగురు, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఒక్కరేసి కోచ్‌లు ఉన్నారు. దీంతో క్రీడాకారులకు సరైన శిక్షణ అందడంలేదు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, నారాయణపేట, మక్తల్, వనపర్తి, ఆత్మకూర్ పట్టణాల్లోని క్రీడాశాఖ, గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాల్లో కోచ్‌ల కొరత క్రీడాకారులను వేధిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట, కల్వకుర్తి (గ్రీన్ ఫీల్డ్), కొల్లాపూర్ (గ్రీన్ ఫీల్డ్), గద్వాల జిల్లా కేంద్రంలో డీఎస్ఏ స్టేడియం, మరో గ్రీన్ ఫీల్డ్, ఇటిక్యాల మండలం ఎర్రవల్లి చౌరస్తాలో (గ్రీన్ ఫీల్డ్) స్టేడియాలు ఉండగా.. శిక్షకులు కరువయ్యారు.

కోచ్‌ల నియామకాలపై ప్రతిపాదనలు..



స్టేడియాల్లో కోచ్‌ల నియామకంపై గతంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణకు ప్రతిపాదనలు పంపడం జరిగింది. మరోసారి ప్రతిపాదనలు పంపుతాం. కోచ్‌లతో నైపుణ్యంగల క్రీడాకారులు వెలుగులోకి వస్తారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేసుకోవచ్చు.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

కోచ్‌ల నియామకం చేపట్టాలి..

మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా స్టేడియాల నిర్మాణం చేపట్టారు. చిన్నచింతకుంట మండలం అల్లీపూర్‌లో మినీ స్టేడియం, జిల్లా కేంద్రంలో ఎంవీఎస్ కళాశాల మైదానంలో మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భూత్పూర్ మండలం పోతులమడుగులో మినీ స్టేడియం పనులు పురోగతిలో ఉన్నాయి. అదే విధంగా జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో హైదరాబాద్ మినహా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అన్ని హంగులతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. ఇండోర్‌లో ఆరు షటిల్ బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేశారు. అయితే కోచ్ లేకపోవడంతో షటిల్ ఆడే క్రీడాకారులకు శిక్షణ అందకుండా పోయింది. నూతన కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా క్రీడారంగం బలోపేతం కోసం తగిన చర్యలు తీసుకోవాలని, స్టేడియంలో క్రీడలకు సరిపడా కోచ్‌ల నియామకం చేపట్టాలని కోరుతున్నారు. నూతనంగా నిర్మించే స్టేడియాలలో సరిపడా కోచ్‌లు, ప్రతి జిల్లాకు 8 నుంచి 10మంది పాపులర్ క్రీడలకు కోచ్‌లు నియామకం చేపట్టాలని సీనియర్ క్రీడాకారులు కోరుతున్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థితో ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మండలంలోని ధర్మాపూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఆర్.సోనాలి గుజరాత్ రాష్ట్రం వడోదరలో వచ్చేనెల 5 నుంచి 9 వరకు జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీల్లో అండర్–17 విభాగంలో హ్యామర్ త్రోలో ప్రతిభచాటి ద్వితీయస్థానంలో నిలిచింది. మంగళవారం విద్యార్థిని పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించి సన్మానం చేశారు. జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పతకం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ కృష్ణయ్య, పీడీ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో గురుకుల విద్యార్థి ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న గురుకుల విద్యార్థి గణేష్

లింగాల: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల చెందిన ఇంటర్ విద్యార్థి ఏ.గణేష్ రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఇండివిజువల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నాడు. కామారెడ్డి జిల్లా ఉప్పల్‌వాయిలో ఈ నెల 9వ తేదీ నుంచి 12 వరకు రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించారు. భానుప్రసాద్, గణేష్ అండర్–19 విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్ర స్థాయి ప్రథమ, ద్వితీయ స్థానాలలో ప్రతిభ కనబర్చినట్లు పీడీ వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ బాలస్వామి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

కురుమూర్తిరాయ గోవిందా.. గోవింద



జాతర ప్రాంగణంలో భక్తుల రద్దీ



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

చిన్నచింతకుంట: గోవింద నామస్మరణతో మంగళవారం కురుమూర్తి కొండలు మార్మోగాయి. అమావాస్య సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పూజారులు సుప్రభాత సేవ, పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చొని స్వామి వారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు గండ దీపాలు మోశారు. పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మరికొందరు భక్తులు తలనీలాలు సమర్పించారు. అనంతరం ఉద్దాల మండపం, అలువేలు మంగమ్మ, ఆంజనేయ స్వామి, చెన్నకేశవ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన మిఠాయి, ఆటవస్తువులు, గాజుల దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.

ఆలయ అభివృద్ధికి కృషి

కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపురంలోని తన నివాసం నుంచి కురుమూర్తి గుట్టకు పాదయాత్ర చేపట్టారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ సిబ్బంది, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆశీస్సులతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. స్వామి ఆశీస్సులు సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలన్నారు. స్వామి వారి ప్రధాన ఆలయం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టేలా చూస్తానని తెలిపారు.

జూరాలలో 8.087 టీఎంసీల నీరు నిల్వ

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి మంగళవారం రాత్రి 8గంటల వరకు 1,092 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 325 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,543 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.087 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

బీచుపల్లిలో భక్తజన సందోహం



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. అమావాస్యను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామికి ఆలయ అర్చకులు ఆకుపూజ, అభిషేకం పూజలు నిర్వహించారు. కార్తీకమాసం చివరిరోజు కావడంతో మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. ఆంజనేయస్వామి ఆలయ పాలకమండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు